క్లుప్తంగా

రామ్మోహనరావు మృతి కళా రంగానికి తీరని లోను

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన వ్యాపారవేత్త, హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ) కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు బంకా రామ్మోహనరావు (74) మృతి ఆధ్యాత్మిక, సేవా, కళా రంగాలకు తీరని లోటని హిందూ యుజవన సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ నెల 21న బంకా రామ్మోహరావు ఆకస్మికంగా మృతి చెందారని, ఏలూరులో పలు ఆధ్యాత్మిక, ధార్మిక, కళాసంస్థల్లో సభ్యుడిగా తన విశేషమైన సేవలందించారని కొనియాడారు. ఆయన మృతిపై వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు జవ్వాజి మోహన్ విఠల్, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంత రావు తదితరులు సంతాపం తెలిపారు.

రామానుజన్ జీవితం ఆదర్శనీయం



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గణిత ఘనాపాటి శ్రీనివాస రామానుజన్ 138వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పెద్దలు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రామానుజం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని వారన్నారు. చిన్న వయస్సు నుంచి అసాధారణ ప్రతిభ గల బాలుడిగా గుర్తింపు పొందారన్నారు. విద్యార్థి దశ నుంచి గణితం పట్ల ఆసక్తిని పెంచుకుని చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

మానవాళికి భగవద్గీత ఆదర్శం

కొయ్యలగూడెం: భగవద్గీత మానవాళి మనుగడకు ఆదర్శనీయమని గీతా ప్రబోధాన్ని అనుసరించిన వ్యక్తులు ఆదర్శనీయులవుతారని డాక్టర్ లక్ష్మీ ధర్ బెహరా (డైరెక్టర్ ఐఐటీ, మండి హిమాచల్‌ప్రదేశ్) పేర్కొన్నారు. గీతాజయంతి వేడుకలలో భాగంగా లెర్న్ గీత లివ్ గీత, ఇస్కాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. సృష్టిలో పుట్టిన రోజు జరుపుకునే ఏకైక గ్రంథం శ్రీమద్ భగవద్గీత మాత్రమేనని అన్నారు. భగవద్గీత చదవడం ద్వారా మానవ జీవితంలోని అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందని, గీత మత గ్రంథం కాదని ధర్మ గ్రంథమన్నారు. గీతాపారాయణం శ్లోకాలను పఠించి వివరించడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మెమొంటోలు ప్రదానం చేశారు.

వీధినపడ్డ చిరుద్యోగులు

- వలంటీర్ల విషయంపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఏడు నెలలుగా వేతనాలు నిల్



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు(ఫైల్)

ఏలూరు (టూటౌన్): తమ లాంటి చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం కక్ష గట్టి విధులకు దూరంగా ఉంచడం తగదంటూ ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలకు తమకు సంబంధం ఏంటి? అని వారు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి 50 ఇళ్లకూ ఒక వలంటీర్ చొప్పున తమకు నెలకు రూ.5వేలు గౌరవ వేతనం ఇచ్చి విధుల్లోకి తీసుకుందన్నారు. విద్యార్హత పదో తరగతి అని చెప్పిన భవిష్యత్‌లో తమకు ప్రభుత్వ ఉద్యోగం వస్తుందనే ఆశతో డిగ్రీ, పీజీ వంటి ఉన్నత విద్యార్హతలు ఉన్నా తాము వలంటీర్ విధుల్లో చేరామని వలంటీర్లు చెబుతున్నారు. తమను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించిందనే ఒకే ఒక కారణంతో గత ఏడు నెలల నుండి విధులకు దూరం పెట్టి కనీసం ఇచ్చే రూ.5 వేలు వేతనాలు కూడా ఇవ్వకపోవడంపై వలంటీర్లు మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు కూటమి నాయకులు మా వేతనాలను నెలకు రూ.10వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చారని కానీ నేడు ఇచ్చే రూ.5వేలు కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వలంటీర్‌గా కొనసాగించడం కుదరకపోతే ఇతర శాఖల్లోనైనా తమ అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ ఏలూరు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న వార్డు సచివాలయ వలంటీర్లు ముక్త కంఠంతో కోరుతున్నారు.

ఏలూరు కార్పొరేషన్‌లో వలంటీర్లు ఇలా

ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 88,366 ఇల్లు ఉన్నాయి. మొత్తం రేషన్ కార్డులు 66,075 ఉన్నాయి. క్లస్టర్‌లు 1484 ఉండగా మొత్తం డివిజన్‌లు 50 ఉన్నాయి. 79 వార్డు సచివాలాయలు ఉండగా వీటి పరిధిలో మొత్తం 1,434 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. పేరుకు పదో తరగతి పాసైన వారికి వలంటీర్ల ఉద్యోగం ఇస్తామన్నా గత ప్రభుత్వం హాయాంలో ఎక్కువ శాతం మంది డిగ్రీ చదివిన నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో వలంటీర్లుగా విధులు నిర్వర్తించారు. భవిష్యత్‌లో ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ప్రాధాన్యత ఇస్తుందనే చిరు ఆశతో ఈ చిరుద్యోగంలో పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు చేరారు. అయితే వారి పరిస్థితి నానాటికి దిగజారిపోతుండటంతో తమ జీవితాలు రోడ్డున పడ్డాయంటూ వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు.

నెరవేరని రూ.10వేల వేతనం హామీ

ఎన్నికల ముందు కూటమి నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల వేతనం రూ.10వేలకు పెంచుతామంటూ ఉత్తరకుమార ప్రగల్బాలు పలికారు.సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏలూరులో నిర్వహించిన వారాహి యాత్రలో వలంటీర్లపై అమితమైన ప్రేమను, బాధను ఒలకబోశారు. రూ.5 వేలు గౌరవ వేతనం ఇచ్చి వలంటీర్లతో గొడ్డు చాకిరీ చేయిస్తున్నారంటూ వైఎస్సార్ సీపీపై విమర్శలు గుప్పించారు. మరి అధికారం చేపట్టి ఆరు నెలలు దాటినా నేటి వరకు వలంటీర్లపై ఎలాంటి ప్రకటన చేయకుండా వారిని విధుల్లోకి తీసుకోకుండా, బకాయి వేతనాలు చెల్లించకపోయినా డిప్యూటీ సీఎం నోరు మెదపకపోవడం పట్ల వలంటీర్లు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైతం తాము అధికారం చేపట్టాక కూడా వలంటీర్లను కొనసాగిస్తామంటూ ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు



వలంటీర్లకు గత ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. కనీసం విధుల్లోకి తీసుకోకుండా మమ్మల్ని ఇబ్బందిపెడుతున్నారు. కనీసం గతంలో ఇచ్చిన రూ.5 వేలు గౌరవ వేతనం అయినా చెల్లిస్తే మా కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది. రాజకీయాల కోసం మమ్మల్ని పక్కనబెట్టడం ఎంత వరకు సమంజసం?

– బి.పృథ్వీరాజు, వలంటీర్

సేవలకు దూరంగా ఉంచుతున్నారు



గతంలో వలంటీర్లుగా మేము ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ఇచ్చే పింఛన్‌లను అందించే వాళ్లం. ప్రజలకు అన్ని ప్రభుత్వ పథకాలను వారికి అందేలా చూసేవారం. అలాంటి మమ్మల్ని విధులకు దూరం పెడుతుంటే బాధగా ఉంటుంది. తక్షణం మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలి.

– ఎస్‌కె బాషా, వలంటీర్

70 శాతం మంది మహిళలే



ఏలూరు కార్పొరేషన్‌లో పని చేసే వార్డు వలంటీర్లలో 70 శాతం వరకు మహిళలమే ఉన్నాం. ఇచ్చే రూ.5 వేల గౌరవ వేతనం మా కుటుంబాలకు వేడి నీళ్లకు చల్ల నీరులా అక్కరకు వచ్చేది. ఏడు నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులుపడుతున్నాం. ఇప్పటికైనా మా వేతనాన్ని మంజూరు చేసి ఆదుకోవాలి.

– పి.మమత, వలంటీర్

ప్రభుత్వం కక్ష సాధింపు తగదు



వలంటీర్లపై ప్రభుత్వ కక్ష సాధింపు తగదు. గ్రామ, వార్డు వలంటీర్లకు తక్షణం వేతన బకాయిలు చెల్లించాలి. గత 7 నెలలుగా వలంటీర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వలంటీర్లపై సానుకూలంగా స్పందించాలి

– ఆర్.లింగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

మానవత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం చెక్‌ను అందజేస్తున్న రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సోమశేఖర్, మానవత సభ్యులు

ఏలూరు (టూటౌన్): ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందజేశారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్‌లో మానవత ఏలూరు కమిటీ నెలవారీ సమీక్షా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంకామ్ రెండో సంవత్సరం విద్యార్థిని సీహెచ్ కుసుమకు రూ.14, 300, బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి అజయ్ చౌదరికి రూ.20,000, ఇంటర్మీడియట్ విద్యార్థిని కె.స్వాతికి రూ.5000, ఫార్మా డీ విద్యార్థిని జి.ఉషస్వినికి రూ.15,000ను అందించారు. విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు సౌజన్యంతో అంధుల పాఠశాల బాలికలకు ఇవ్వాల్సిన రూ.5000 విలువైన కాస్మెటిక్స్‌ను పాఠశాల నిర్వహకుడు శేఖర్ కు అందజేశారు. కార్యక్రమంలో పుల్లాబొట్ల సత్యవాణి, పోదూరి కనకదుర్గ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బొల్లు సోమశేఖరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సాయిసుధ, కోశాధికారి అల్లూరి మోహిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

బుట్టాయగూడెం: మండలంలోని పడమర రేగులకుంటలో ఆదివారం ఘనంగా గంగానమ్మ, ముత్యాలమ్మ, గణపతి విగ్రహాల నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయాన్ని, విగ్రహాల ఏర్పాటును గ్రామస్తుల సహకారంతో నిర్మించారు. బి.ప్రసాద్, బీజేపీ నాయకులు కొండేపాటి రామకృష్ణలు రూ.5000 నగదును ఆలయ కమిటీ వారికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జలపాలరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



సభలో మాట్లాడుతున్న బండి వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): అసంఘటిత రంగంలో పనిచేస్తున్న జట్లు, లాగుడుబండ్ల కార్మికులకు, ముఠా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏలూరు మెయిన్ బజార్ జలవాని సెంటర్‌లో ఏఐటీయూసీ అనుబంధ ఏలూరు నగర జట్లు, లాగుడుబండ్ల కార్మిక సంఘం 54వ వార్షికోత్సవ సభ ఆదివారం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో గత వార్షికోత్సవం నుంచి ఇప్పటివరకు సంఘంలోని సభ్యులు, వ్యాపారస్తులు మృతి చెందిన వారికి సభ రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలను వివరించారు. ఆంధ్రకు అతిపెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కు కర్మగారాన్ని కూడా ప్రైవేటీకరణ చేయటానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఏఐటీయూసీ పోరాటఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్లుగా మార్చి కార్మిక హక్కులను మోడీ ప్రభుత్వం హరిస్తుందని వెంకటేశ్వరరావు విమర్శించారు. కార్యక్రమంలో సభలో భజంత్రీ శ్రీనివాసరావు,మారిన వెంకట్రావు, కడుపు కన్నయ్య యూనియన్ కోశాధికారి పెచ్చేటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఎస్ సోమేశ్వరరావు, వంగలపూడి గంగరాజు, గొర్లి అప్పారావు, కరణం సురేష్ ,సుంకర రాంబాబు పాల్గొన్నారు.

భజన కళాకారులకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలి



కళాకారుల ప్రోత్సాహక కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): టీటీడీ దాని అనుబంధ దేవాలయాల్లో పని చేస్తున్న భజన కళాకారులందరికి రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని సకల కళాకారుల సంక్షేమ సంఘం ఏలూరు మండల అధ్యక్షుడు శ్రీహరికోటి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్ ఆర్ పేటలోని లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో కళాకారుల ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ దేవాలయాల్లో భజన చేసే కళాకారులకు రూ. 10 వేలు గౌరవ వేతనం ఇచ్చేలా ఈ నెల 24న జరిగే టీటీడీ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. తిరుమలలో నిత్యం జరుగుతున్న అఖండ హరినామ సంకీర్తనలకు అనుమతినిచ్చిన విధంగా రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లోనూ, తిరుపతిలోని ప్రముఖ అనుబంధ దేవాలయాల్లో కూడా అఖండ హరినామ సంకీర్తనలు గానం చేసే విధంగా భజన బృందాలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ దేవాలయాల్లో భజన చేసిన కళాకారులకు రానుపోను చార్జీలు అందించాలని, వసతిని కల్పించాలని, భజన నేర్పే గురువులకు ప్రతి నెలా గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సకలకళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దువ్వి రామారావు మాట్లాడుతూ ఈ విషయాలపై ఎంతో కాలంగా పోరాటం సాగిస్తున్న తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర్ స్వామీజీకి మా సంఘం మద్దతుగా నిలుస్తుందన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జీవీఎల్ నరసింహారావు, దువ్వి హేమసుందర్, పుల్లాబొట్ల పురుషోత్తమరావు తదితరులు పాల్గన్నారు.

కులమతరహిత సమాజ నిర్మాణమే క్రిస్మస్ సందేశం



క్రిస్మస్ హై టీ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కుల, మతరహిత సమాజం నిర్మించి ప్రతి ఒక్కరూ సాటి వారిని ప్రేమిస్తూ జీవించడమే క్రిస్మస్ సందేశమని ఏలూరు పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠ పాలనాధికారి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. ఆదివారం స్థానిక గ్రేవియర్ నగర్‌లోని బిషప్ హౌస్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కలిసి ఆయన క్రిస్మస్ హై టీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ జయరావు మాట్లాడుతూ విశ్వాన్ని రక్షించడం కోసమే క్రీస్తు జన్మించారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పదవులతో సంబంధం లేకుండా ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. సమాజంలోని పేదలను ఆదుకోవడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. క్రీస్తు జననం ప్రపంచాన్ని ఏకం చేస్తుందని, ప్రతి ఒక్కరూ ఏసు క్రీస్తు సూచించిన మార్గంలో పయనించి సమాజంలో శాంతిస్థాపన చేయాలని పిలుపునిచ్చారు. తొలుత క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయ ప్రకాష్, ఎస్ఎంఆర్ పెదబాబు, ఘంటా ప్రసాద రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన రావు, ముస్లిం నాయకుడు రాజా అహ్మద్, ఏలూరు అదనపు ఎస్పీ నక్కా సూర్య చంద్రరావు, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారామ్, ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ బాల, ఫాదర్ మైఖేల్ ఇంజమాల తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు

కొయ్యలగూడెం: చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలవ గట్టు మట్టి మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. వారం రోజులుగా రాత్రి వేళల్లో కన్నాపురం గ్రామానికి చెందిన మట్టి మాఫియా జేసీబీలను పెట్టి కాలవ గట్టును కొల్లగొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కాలవ గట్టు సగభాగం మట్టిని తరలించుకుపోయారని రైతులు పేర్కొన్నారు. టిప్పర్ మట్టిని నాలుగు వేల నుంచి ఐదు వేల రూపాయల వరకు ఇటుక బట్టీల నిర్వహకులకు అమ్మి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. మట్టి అక్రమ రవాణా గురించి తాడిపూడి ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కాలువ గట్టు కోతకి గురి కావడంతో వ్యవసాయ పొలాలలోకి తమ వాహనాలు రాకపోకలు సాగించలేకపోతున్నాయన్నారు. దీని వలన పండిన పంటను గమ్య స్థానాలకు చేర్చడానికి రెండింతల భారంగా పరిణమించిందని రైతులు వాపోతున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	12
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	20
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	60
కాకర కాయలు	34-44	బీట్‌రూట్	54
బీరకాయలు	30	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	30	అల్లం	70
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	48	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	45	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07
దోసకాయలు	34	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

పరిహారం.. ప్రశ్నార్థకం



ఇటీవల వరదకు కుక్కునూరులో నీట మునిగిన పంట చేలు (ఫైల్)

- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై స్పష్టత కరువు
- ఊసెత్తని ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆందోళనలో నిర్వాసితులు

కుక్కునూరు: ఇటీవల పోలవరం ప్రాజెక్ట్ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం పట్ల విలీన మండలాల నిర్వాసితులు ఆయోమయం వ్యక్తం చేస్తున్నారు. 2026 అక్టోబర్‌కు ప్రాజెక్ట్ పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. కాని నిర్వాసితులకు ఇవ్వాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై స్పష్టమైన హామీ ఇవ్వలేదు సరికదా ఆ ఊసే ఎత్తలేదు. దీంతో ప్రభుత్వానికి ప్రాజెక్ట్ నిర్మాణంపై ఉన్న శ్రద్ధ ఆ ప్రాజెక్ట్ నిర్మాణం సాకారమయ్యేందుకు సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించడంపై లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఏడాది గోదావరి వరదలతో పంటలు, గ్రామాలు నీటమునిగి బ్రతుకు జీవుడా అంటూ పిల్లా, పాపలతో పునరావాస కేంద్రాలకు వెళ్లి తలదాచుకుంటున్న నిర్వాసితుల గోడు ఈ నాయకులకు పట్టదా అని ఆవేదన చెందుతున్నారు. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో ముంపుకు గురవుతున్న భూములకు పరిహారం చెల్లించి ఏళ్లు గడుస్తున్నా ఇంకా ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపుపై స్పష్టత రావకపోవడం ఏమిటని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. ఓ పక్క ప్రాజెక్ట్ నిర్మాణాన్ని 41.15 కాంటూర్ పరిధి వరకు పూర్తి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి 45 కాంటూర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని చెప్పడం పట్ల అసలు 45 కాంటూర్ వరకు ప్రాజెక్ట్ నిర్మాణం ఉంటుందా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక 41.15 కాంటూర్‌లోని నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకే ఇన్నేళ్లు పడితే ఒక వేళ 45 కాంటూర్ నిర్వాసితులు పరిహారం చెల్లించాల్సి వస్తే అది ఇంకెన్నేళ్లు పడుతుందోనని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ పేరుతో నిర్వాసిత మండలాలను విలీనం చేసి గొప్ప పని చేశామని చెప్పుకుంటున్న నాయకులు విలీన మండలాల నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని విమర్శిస్తున్నారు. ఇకనైనా కాంటూర్‌లతో, ప్రాజెక్ట్ నిర్మాణంతో సంబంధం లేకుండా విలీన మండలాల నిర్వాసితులకు పరిహారం చెల్లించి పునరావాస కాలనీలకు పంపి గోదావరి వరదల బాధ నుంచి విముక్తి కల్పించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో కొన్ని గ్రామాలకు ఇచ్చారు



గత ప్రభుత్వంలో ప్రాజెక్ట్ పనులు చేపడుతూనే కుక్కునూరు మండలంలోని 41.15 పరిధిలో కొంతమంది నిర్వాసితులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలి.

కొఠారు చలపతి, కుక్కునూరు

వేదమంత్రాలతో మార్మోగుతున్న పంచాయతన క్షేత్రం

నిడమర్రు: మందలపర్రు ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రం వేద మంత్రోచ్ఛరణతో మార్మోగుతోంది. లోక కల్యాణం ఆశించి ప్రవాస భారతీయుడు, వైదిక జ్యోతిష్య పరిశోధకులు అక్కినప్రగడ రాఘవేంద్రసాయి (ఇంగ్లాండ్) యజ్ఞ కర్తగా ఆలయ ప్రాంగణంలో మహారుద్ర యజ్ఞ హోమ కార్యక్రమాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ యజ్ఞ, హోమాలు ఈనెల 26వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు ఆదివారం 27 మంది సువాసినులు, 21 మంది వేద పండితులు ముందస్తు యజ్ఞ పూజలు, యాగశాల ప్రవేశం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 6 గంటల వరకూ ఈ మహా రుద్ర యజ్ఞ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ ఐదురోజులు గణపతి పూజ, శుద్ధి పుణ్యాహవచనం, రుత్విక్ వర్ణం, చతుర్వేద పారాయణం, యాగశాల ప్రదక్షణ, గో, అశ్వం, మేషం పూజలు నిర్వహిస్తున్నారు. దేశం సుభిక్షం ఆశించి ఈ పంచాయతన క్షేత్రంలో మహారుద్ర యజ్ఞం సంకల్పించినట్లు యజ్ఞ కర్త రాఘవేంద్ర శర్మ తెలిపారు.

108 రకాల సుంగధ ద్రవ్యాలతో : దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 108 రకాల సుంగధ ద్రవ్యాలు, వివిధ చెట్ల వేర్లు, మూలికలు ఆవు నెయ్యితో 50 కిలోల చూర్ణం గుళికలుగా చేసి ఈ యజ్ఞ పూజల్లో వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా తెప్పించిన 400 కిలోల స్వచ్ఛమైన ఆవు నెయ్యి, 800 కిలోల రావి సమిదలు (పుల్లలు) ఈ 5 రోజుల పాటు ఈ హోమంలో వేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 21 మంది రుత్విజులు ఈ పూజల్లో పాల్గొంటున్నారు.